క్లుప్తంగా

అమ్మవారికి పూజలు


చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న బాక్స్ ప్రసాద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్ నగర్‌లోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని సోమవారం గాయత్రీదేవిగా అలంకరించారు. మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారిని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

71 కేజీల లడ్డూ వితరణ


ఆలయ కమిటీకి లడ్డూ అందజేస్తున్న నానాజీ సోదరులు

కడియం: స్థానిక దేవీచౌక్‌లోని దుర్గాదేవి అమ్మవారి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని వెంకట భక్తాంజనేయ స్వీట్స్‌స్టాల్ అధినేత నేతి నానాజీ సోదరులు 71 కేజీల లడ్డూను ఆలయానికి అందజేశారు. అమ్మవారి రూపాన్ని లడ్డూపై చిత్రీకరించారు. రెండేళ్లుగా అమ్మవారికి లడ్డూ ప్రసాదం అందిస్తున్న నానాజీ సోదరులను ఆలయ కమిటీ అభినందించింది.

విద్యార్థులకు శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో దసరా సెలవుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు రవిచంద్ర గణితంలో మెళకువలు, నీతికథలు చెప్పారని లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు.

మహిళ అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తాడేపల్లి శ్రావణిని సోమవారం అరెస్టు చేసి ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఆమె నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అన్నపూర్ణా నమోస్తుతే..

- పూజలందుకున్న దుర్గమ్మ
- వైభవంగా దసరా మహోత్సవాలు

సీటీఆర్ఐ: దసరా మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం కనకదుర్గమ్మ వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. దేవీచౌక్‌లో అమ్మవారిని అన్నపూర్ణా దేవీగా అలంకరించారు. గోదావరి గట్టున ఉన్న ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు మీనాక్షిగా దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరిని అప్పాలతో అలంకరించారు. సరస్వతీ ఘాట్, సారంగధరేశ్వరస్వామి ఆలయం, కోటిలింగాల క్షేత్రంలోని శంకర మఠంలోని అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించారు. ఉల్లిపాయల మార్కెట్ వెనుక ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఎంపీ భరత్ రామ్ దర్శించుకున్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కన్యకా పరమేశ్వరిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి శ్రీను నేతృత్వంలో పూజలు జరుగుతున్నాయి. అలాగే బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి గాయత్రిగా దర్శనమిచ్చారు.


ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మీనాక్షీ దేవిగా..


వాసవీమాతకు అప్పాలతో అలంకరణ


మోరంపూడి సాయినగర్‌లో కన్యకాపరమేశ్వరిగా..

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

- ఎంపీ భరత్ రామ్
- నూతన యూపీహెచ్‌సీ ప్రారంభం

కంబాలచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. స్థానిక రంభ, ఊర్వశి థియేటర్ సమీపంలోని సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్ వద్ద నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు వెళుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ప్రజలు యూపీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. రోజుకు ఒక్కో యూపీహెచ్‌సీలో 1,500 నుంచి 2 వేలు ఓపీలు నమోదు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం సీజనల్ ఫీవర్లు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరికి చేరువుగా యూపీహెచ్‌సీలు ఉండటం అదృష్టమన్నారు. కార్యక్రమంలో అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్ఎంసీ ఈఈ పాండురంగారావు, ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి పాల్గొన్నారు.


యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

సమస్యల పరిష్కారానికి కృషి

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..


ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 30వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కాటం రజనీ కాంత్, డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలతో మాట్లాడారు. అప్సర థియేటర్ వెనుక వీధిలో చర్చి ప్రహరీ కూలిపోవడంతో ఖాళీగా ఉన్న ఆ ప్రాంతంలోకి ఆకతాయిలు వెళ్లి మద్యం తాగుతూ గొడవలు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన పోలీసు అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి చర్యలు చేపట్టాలన్నారు. బెస్తవీధిలోని 53, 56 సచివాలయాలను నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలిసి సందర్శించారు. ఆముదాల పెదబాబు, కాటం సంజయ్ కాంత్, రాయుడు రామకృష్ణ, తాలేబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి చిల్లర చేష్టలు

రాజమహేంద్రవరం సిటీ: మద్యాభిషేకం పేరిట టీడీపీ నాయకులు చిల్లర చేష్టలకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు జైలుకి వెళ్తే టీడీపీ చేస్తున్న రాద్ధాంతం విచిత్రంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచి ఇబ్బడిముబ్బడిగా బెల్టు షాపులకు తెరలేపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని తెలుగుదేశం నాయకులు మరిచిపోయి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, అర్జరపు వాసు, గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు

ప్రజారోగ్యానికి సీఎం జగన్ భరోసా


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ భరత్ రామ్


శంభూనగర్ శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

కంబాలచెరువు: ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా ఇస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకు మెరుగైన వైద్యం చేరిందని ఎంపీ భరత్ రామ్ అన్నారు. కంబాలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి, అక్కడి రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో చాలా శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన వైద్యం అందజేయాలన్నారు. మార్గాని సురేష్, సంకిన భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక శంభూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. స్పెషలిస్ట్ వైద్యులు మూర్తి, గైనకాలజిస్టులు శివ, బిందు, మెడికల్ ఆఫీసర్లు మనోజ్, అశోక్, అకిరా హాస్పిటల్ ఆప్తాలజీ అసిస్టెంట్ వైద్యసేవలు అందించారు. మొత్తం 170 మంది వైద్యసేవలు పొందగా ఐదుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలకు రిఫరల్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి ప్రసాద్ (రాజమాళి), 45వ వార్డు సచివాలయ కన్వీనర్లు అంగాడి సత్యప్రియ, దమ్ముప్రసాద్, షేక్ ఇమామ్ (బాబ్జి), పడమట కామరాజు, జువ్వాల నాగిరెడ్డి, శ్యామ్, గణేష్ కుమార్, మేడపాటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో..

ఇన్నీసుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఫల్మనాలజిస్టు సింధుజ, డెర్మటాలజిస్ట్ శ్రీనివాసవర్మ, మెడికల్ ఆఫీసర్ మాణిక్యాంబ (మేఘన), ఆప్తాలజీ అసిస్టెంట్ 182 మందికి వైద్య సేవలు అందించారు.

పొట్టిలంకలో 433 మందికి..

కడియం: పొట్టిలంకలో నిర్వహించిన వైద్యశిబిరంలో 433 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో గైనకాలజీ, ఆప్తమాలజీ, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తిలు ప్రారంభించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఈలి శ్రీను, తహసీల్దార్ ఎం.సుజాత పాల్గొన్నారు.

514 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామ సచివాలయం 2 పరిధిలోని ఏ బ్లాక్ ఎంపీపీ స్కూల్లో జరిగిన శిబిరంలో 514 మందికి వైద్యసేవలు అందించగా, 25 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లుతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంను ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు సఫారి నాయుడు, కుడిపూడి సత్యనారాయణ, గాదె అనురాధ, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు కడవకొల్లు వెంకటేశ్వరరావు, బొమ్ము శ్రీను, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, నాయకులు బత్తిన అప్పారావు, కుడిపూడి పద్మ, దత్తసాయి, పుచ్చా గోవిందరెడ్డి పాల్గొన్నారు.


పొట్టిలంకలో రోగులకు కళ్లజోళ్లు అందిస్తున్న గిరజాల బాబు, చిత్రంలో తాడాల చక్రవర్తి


శాటిలైట్‌సిటీలో వైద్య పరీక్షలు

సాధారణ కార్యకర్తగా కొనసాగుతా

రాజమహేంద్రవరం సిటీ: పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న తన స్థాయిని తగ్గించి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం అవమానించడమేనని, ఆ పదవిని తిరస్కరిస్తున్నట్లు డీసీసీ మాజీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ప్రకటించారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు చేసిన తనకు, ముందుగా చెప్పకుండా పదవుల నుంచి తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. సాధారణ కార్యకర్తగా కొనసాగుతానని ప్రకటించారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం చైర్మన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన సోమవారం జరిగింది. నాడు నేడు కార్యక్రమం క్రింద ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నెమ్మదిగా ఎందుకు సాగుతున్నాయని గోరంట్ల ప్రశ్నించారు. అలాగే వైద్యుల పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల స్టాల్ ప్రారంభం

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయాలను విక్రయిస్తారని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. మండల వ్యవసాయశాఖ, రైతుసాధికార సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు.

స్పందనకు 17 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై 17 అర్జీలు అందజేశారు. అర్జీలను పూర్తి స్థాయిలో నాణ్యతో కూడిన విధంగా పరిష్కరించాలని కమిషనర్ దినేష్ కుమార్ సూచించారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక పోస్టల్ కాలనీలోని ఒక ఇంటిలో 63 గ్రాముల బంగారం చోరీకి గురైంది. బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 14న దుర్గాప్రసాద్ పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. తిరిగి మర్నాడు వచ్చి చూసేసరికి ఇంటిలో బీరువాలోని బంగారం చోరీకి గురైంది.

మహిళ అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక సుబ్బారావు నగర్‌కు చెందిన 25 ఏళ్ల మహిళ అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఏసీవై రెడ్డి సేవలు చిరస్మరణీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఏసీవై రెడ్డి రాజమహేంద్రవరం నగరాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని రాజమహేంద్రవరం విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. స్థానిక కన్నమతల్లి గుడి వద్ద రాజమహేంద్రవరం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏసీవై రెడ్డి వర్ధంతి నిర్వహించారు. మోరంపూడి జంక్షన్‌లో ఏసీవై రెడ్డి విగ్రహానికి కుటుంబసభ్యులు, ఆయన మిత్ర బృందం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


న్యాయవాదుల సమస్యలను లోక్‌సభలో ప్రస్తావిస్తా

కంబాలచెరువు: న్యాయవాదుల సమస్యలను లోక్‌సభలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఒక రూపాయి ఉండే వెల్ఫేర్ స్టాంపు రూ.20 లు చేయడం దారుణమని న్యాయవాదులు వివరించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే చేయాలన్నారు. ఎంపీ వెంట అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఉన్నారు.

జేఎల్బీ నగర్ మహిళల ఆవేదన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు ఝాన్సీలక్ష్మీబాయి నగర్ (జేఎల్బీ నగర్)లో జరిగిన హత్య ఘటన నేపథ్యంలో నిందితుడి కుటుంబాన్ని ఆ ప్రాంతం నుంచి తరలించాలని తూర్పు మండలం డీఎస్పీకి ఎంపీ భరత్ రామ్ సూచించారు. ఈ ఘటనలో నరేష్ బాబు మృతిచెందగా, అతడి సోదరుడు సురేష్ తీవ్రగాయాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం జేఎల్ బీ నగర్ మహిళలతో కలిసి నరేష్‌బాబు తల్లి సత్యవతి ఎంపీ కార్యాలయానికి వచ్చి భరత్‌రామ్‌ను కలిశారు. హత్య జరిగిన ప్రాంతంలో ఉండటానికి భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ వారికి ధైర్యం చెప్పారు. డీఎస్పీతో మాట్లాడి సమస్యను వివరించారు. హత్య కేసు పురోగతిపై ఆరా తీశారు. అలాగే సురేష్ చికిత్సకు ఒక్క రూపాయి కూడా తీసుకోవద్దని ఆ ఆసుపత్రి వైద్యులను ఫోన్‌లో కోరారు. మూడు రోజుల్లో సురేష్‌ను డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే


మాట్లాడుతున్న క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వమే రాబోతోందని వైఎస్సార్ సీపీ క్లస్టర్ 3 అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో సోమవారం మూడో క్లస్టర్ వార్డు ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. మజ్జి అప్పారావు మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుంచి నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని డివిజన్‌లో నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలన్నారు.

వెండి కిరీటం సమర్పణ


ఓనువులమ్మకు అలంకరించిన వెండికిరీటం

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో కొలువైన ఒనువులమ్మకు భోగవల్లి వెంకట నారాయణ, జ్యోత్స్న దంపతులు సుమారు 8.7 కేజీల వెండితో చేయించిన వెండి కిరీటాన్ని సోమవారం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడాకారిణికి అభినందన

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణాఫ్రికాలో జరిగిన ఐదో ప్రపంచ కప్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్‌లో ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన హేమమాధురి ఇండియా తరపున టీమ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం, వ్యక్తిగతంగా కాంస్యం, డబుల్స్‌లో కాంస్యం సాధించడం గర్వకారణం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో తనను కలిసిన హేమమాధురిని అభినందించారు. దేవరపల్లికి చెందిన హేమమాధురి తల్లిదండ్రులు, కోచ్ ప్రోత్సాహంతో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో హేమమాధురి తల్లితండ్రులు జి.రామమోహన్ (దేవరపల్లి కాలేజీ లెక్చరర్), జి.స్వరూప, కోచ్ ముని, లక్ష్మణ్ ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను వినియోగించుకోవాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అకడమిక్ విద్యతో పాటు ఇంటర్న్‌షిప్ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. పౌరసరఫరాలు, గ్రామ, వార్డు సచివాలయ సేవల విభాగంలో ఐదు వారాల ఇంటర్న్‌షిప్ కోసం తొర్రేడు ఎలిషా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, జేసీ తేజ్ భరత్ సంభాషించారు. కలెక్టర్ మాట్లాడుతూ పౌరసేవలు, ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యకలాపాలపై అవగాహనకు ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందన్నారు.

29న దూదేకుల ముస్లిం సింహగర్జన

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో ఈనెల 29న నూర్‌బాష దూదేకుల ముస్లిం సింహగర్జన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సలీమ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హుకుంపేటలోని మసీదులో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.